# 2. దేవుడు నిజంగా ఉన్నాడా?

ఓ నాస్తిక సభలో ఒకతను దేవుడు లేడని చెప్తున్నాడు. ప్రేక్షకులలో అధిక భాగం నాస్తికులే కాబట్టి అతను చెప్పేది శ్రద్ధగా ఆలకిస్తున్నారు.

“నిజంగా దేవుడంటూ ఉంటే మనందరికీ కనపడాలి కదా? కనపడని దాన్ని ఉన్నట్లుగా అనుకోవడం ఒక మానసిక భ్రమ. దీన్నే ‘ఆస్తికత్వం’ అంటారు. ఓసారి ఆ పిచ్చిపడితే, అందులోంచి బయట పడడానికి సరైన మందే లేకపోవడం దురదృష్టం. అసలు నిజంగా దేవుడంటూ లేడని చిన్న ప్రయోగం ద్వారా మీకు నిరూపిస్తాను.” ఉపన్యాసకుడు తల పైకెత్తి చూస్తూ చెప్పాడు.

“ఓ దేవుడా! నువ్వంటూ వుంటే వెంటనే మాకు కనపడు. అలా కనబడడం నీకు చేతకాకపోతే, కనీసం నన్ను ఈ స్టేజీ మీంచి దింపు. నేను పది లెక్కపెట్టేలోగా ఆ పని చేయి. ఆలోచించుకో. నేను చెప్పినట్లు జరిగితే అప్పుడు నిన్ను నమ్ముతాం. లేదా నువ్వు లేవు. ఒకటి, రెండు, మూడు..”

అతను అంకెలని లెక్కపెట్టసాగాడు.

ప్రేక్షకుల్లోని ఉత్సాహవంతులైన నాస్తికులు కూడా అతను లెక్కించే అంకెలతో గొంతు కలిపి లెక్కపెట్టసాగారు.

“ ...ఐదు...ఆరు...ఏడు...”

ప్రేక్షకులకి ఉత్కంఠ. కొందరు ఆస్తికులకి ఎలాగైనా దేవుడున్నాడని రుజువు దొరికితే బావుండును అనిపించసాగింది. ప్రేక్షకుల్లోంచి ఓ ఆజాను బాహువు లేచి నెమ్మదిగా స్టేజీ మీదకి వెళ్ళాడు. తొమ్మిదో అంకె లెక్కపెడుతున్న ఆ నాస్తికుడ్ని పట్టుకుని స్టేజీ మీంచి కిందకి తోసేసాడు.

“ఏమిటిది? నువ్వెవరు?” అరిచాడా ఉపన్యాసకుడు.

“దేవుడు బిజీగా ఉండడంతో తన తరఫున పంపించిన మనిషిని.” చెప్పి ఆయన స్టేజి దిగి వెళ్ళిపోయాడు.